క్లుప్తంగా

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



సత్తెనపల్లి: మండల తహసీల్దారుగా సీహెచ్ ఉష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా సింగరాయకొండ నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన ఎస్.సురేష్ ప్రకాశం జిల్లా కొత్తపట్నంకు బదిలీ అయ్యారు. తహసీల్దారు ఉషకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె ఆర్డీఓ వి.మురళీ కృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు.

తహసీల్దారుగా ప్రభాకరరావు..



పెదకూరపాడు: మండల తహసీల్దారుగా.. ప్రకాశం జిల్లా చీరాల నుంచి బదిలీపై వచ్చిన జె.ప్రభాకరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు జియావుల్ హక్ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది తహసీల్దారును మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

తహసీల్దారుగా ఎం.సువర్ణ

క్రోసూరు: మండల తహసీల్దారుగా ఎం.సువర్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వీఆర్వోలు ఆమెకు అభినందనలు తెలిపారు. రెవెన్యూ, ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఆర్డీవో కార్యాలయ ఏవోగా హుస్సేన్

సత్తనపల్లి: సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ఏవోగా షేక్ మహమూద్ హుస్సేన్ నియమితులయ్యారు. ఆయన కావలి ఆర్డీఓ కార్యాలయ ఏవోగా విధులు నిర్వహిస్తూ సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి రానున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏవోగా పని చేసిన టి.మస్తాన్‌రావు ప్రకాశం జిల్లా రాచర్ల తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు.

వేద గాయత్రి పురోహిత సంఘ అధ్యక్షుడిగా రాజశేఖర్



సత్తెనపల్లి: వేద గాయత్రి పురోహిత సంఘ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన అంపిరాయని రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్‌లో గల శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం వద్ద సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సెక్రటరీగా అత్తులూరి అనీల్ కుమార్, ట్రెజరర్‌గా పున్నావఝుల సీతారామశాస్త్రి ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2024–26 వరకు పనిచేస్తుంది. కార్యక్రమంలో పురోహితులు ఉన్నారు.

ఆర్డీఓను కలిసిన కౌన్సిలర్ల బృందం



సత్తెనపల్లి: సత్తెనపల్లి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వి.మురళీకృష్ణను మున్సిపల్ కౌన్సిలర్ల బృందం, వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, అవ్వారు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బండి మల్లికార్జునరెడ్డి, దేవరశెట్టి రవికుమార్, రేపూడి రవితేజ, పెద్దింటి వెంకటేశ్వర్లు, మాదికొండ నారాయణ, షేక్ మహ్మద్ గని, సంకుల తిరుమలరావు, కాటుమాల డేవిడ్ ఉన్నారు.

1,300 ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

క్రోసూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ మండలాల్లోని రెండు, పెదకూరపాడు మండలంలోని రెండు గ్రామా సచివాలయల నుంచి ఇప్పటి వరకు 1,300 జగనన్న ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ బి.భాస్కరరావు సోమవారం తెలిపారు. సర్వర్ సమస్య తీవ్రంగా ఉండటంతో కొన్ని సచివాలయాల్లో ఆలస్యంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆయా కార్యదర్శులు తెలిపారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిదులతో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారిణి నాగజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

తూకం.. మోసం

- తూకాల్లో వ్యాపారుల మాయాజాలం
- కిలోకు 100 నుంచి 150 గ్రాముల తరుగు
- ఎలక్ట్రానిక్ కాటాలతో మరింత దోపిడీ
- నష్టపోతున్న వినియోగదారులు



సత్తెనపల్లిలో రోడ్డు పక్కన చేపల విక్రయం వద్ద కాటా పరిశీలిస్తున్న తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ జాన్‌సైదా

సత్తెనపల్లి: వ్యాపారం ఒక నమ్మకం.. వినియోగదారుడే దేవుడు.. అన్నాడు మహాత్మాగాంధీ. ఈ సూత్రాన్ని కొందరు వ్యాపారులు విస్మరిస్తున్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా మోసాలకు పాల్పడుతున్నారు. తూకాల్లో తేడాలు అధికమయ్యాయి. కాటాలతో దగా చేస్తున్న కొందరు వ్యాపారుల చేతివాటానికి నిరక్షరాస్యులతో పాటు విద్యావంతులు కూడా మోసపోతున్నారు. ఆహార పదార్థాలు, కూరగాయలు, ఇతర సరుకులు కొనుగోలు చేసినప్పుడు కొసరు, మొగ్గు అని గతంలో వ్యాపారులు కాస్తంత ఎక్కువ తూకం ఇచ్చేవారు. ప్రస్తుతం తక్కెడలు పోయి వాటి స్థానంలో డిజిటల్ ఎలక్ట్రానిక్ కాటాలు వచ్చాయి. దీంతో పక్కాగా తూకం వేస్తున్నారు. ప్రతీది బంగారంలా భావిస్తున్నారు. రాళ్ల కాటాలతో హెచ్చుతగ్గులు ఉంటాయని ప్రతి ఒక్కరికి తెలిసిందే. కానీ ఎలక్ట్రానిక్ కాటాల్లో కూడా వినియోగదారులను ఎక్కువగా మోసం చేయవచ్చని కొందరు వ్యాపారులు నిరూపిస్తున్నారు.

మార్పు రావడం లేదు..

చిల్లర దుకాణాలు, చికెన్, మటన్, చేపల దుకాణాలు, కూరగాయలు మార్కెట్లపై తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు చేస్తున్నప్పటికీ.. కొందరు వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. తూకంలో తేడా ఉందని వినియోగదారులకు అనుమానం వచ్చినప్పటికీ.. గొడవలు ఎందుకులే అని సర్దుకు పోయే పరిస్థితి నెలకొంది. కొన్ని దుకాణాల్లో సీల్ లేకుండానే ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగిస్తున్నారు. మరికొన్ని చోట్ల అరిగిపోయిన రాళ్లు, మొద్దు కాటాలు వినియోగిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఈ మోసాలు చిల్లర దుకాణాల్లో కొద్ది మేర మాత్రమే వ్యత్యాసం వస్తుండగా చికెన్, మటన్, చేపల దుకాణాల్లో మాత్రం భారీ తేడాలు ఉంటున్నాయి. దీంతో వ్యాపారుల చేతివాటానికి వినియోగదారులు బలైపోతున్నారు. ఇప్పటికైనా తూనికలు, కొలతల శాఖఅధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించి కాటాలతో మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఎలక్ట్రానిక్ కాటాలతో మోసం ఇలా

సాధారణంగా ఘన పదార్థాలను కిలో గ్రాముల్లో, ద్రవ పదార్థాలను లీటర్లలో కొలుస్తుంటారు. ఘన పదార్థాల కొనుగోలుకు వెళితే ... ఎలక్ట్రానిక్ కాటాల్లో ద్రవ పదార్థాల తూకం మోడ్‌లో ఉంచి తూకం వేస్తున్నారు. కాటా స్క్రీన్ పై ఎల్ అనే అక్షరంపై మాత్రం స్టిక్కర్ అతికిస్తున్నారు. వాస్తవానికి కిలో ఘనపదార్థం బరువు 1,000 గ్రాములు ఉండగా.. ద్రవ పదార్థం బరువు 850 గ్రాములు మాత్రమే వస్తుంది. దీంతో కాటాలో ఆప్షన్‌ను లీటర్ మోడ్‌లోకి మార్చి ఘన పదార్థాల తూకం వేస్తున్నారు. దీంతో స్క్రీన్ పై కనిపించేది లీటర్ల తూకమైన కొనుగోలుదారులకు కిలోలుగా చూపించి మోసం చేస్తున్నారు. స్క్రీన్ పై ఎల్ అనే అక్షరం కనపడకుండా స్టిక్కర్ వేయడమో .. రంగు పూయడమో చేస్తున్నారు. దీంతో వినియోగదారుడు కిలోకు 100 నుంచి 150 గ్రాముల వరకు నష్టపోతున్నారు.

వినియోగదారుల్లో ప్రశ్నించే తత్వం రావాలి



వినియోగదారుల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి. అప్పుడే వ్యాపారుల్లో మోసపూరిత ధోరణులు మారుతాయి. ఏదైన వస్తువు కొనుగోలు చేసే సమయంలో తూకాలను నిశితంగా గమనించాలి. మోసాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వస్తే జిల్లా కార్యాలయం 0863–2223202, ఇన్‌స్పెక్టర్ 98851 27512 నంబర్లకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి పేరు గోప్యంగా ఉంచుతాం. మోసానికి పాల్పడే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

– షేక్ జాన్ సైదా, ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతల శాఖ, సత్తెనపల్లి

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: నియోజకవర్గంలో ఐదు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత సోమవారం తెలిపారు. రాజుపాలెం మండలం గణపవరం ఓసీ–2 అంగన్‌వాడీ కేంద్ర పరిధిలో–1, ముప్పాళ్ల మండలం మాదల బీసీ–1 అంగన్వాడి కేంద్రం పరిధిలో–1, ఇరుకుపాలెం–1 అంగన్వాడీ కేంద్రం పరిధిలో–1, సత్తెనపల్లి మండలం కొమెరపూడి ఓసీ ముస్లిం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో–1 ఆయా పోస్ట్ ఖాళీగా ఉన్నాయన్నారు. ఐదు ఆయా పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థి తప్పని సరిగా 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 2023 జూలై ఒకటి నాటికి 21 సంవత్సరాల వయసు నిండి 35 సంవత్సరాల వయసు లోపు వారై ఉండాలన్నారు. అభ్యర్థి స్థానికులు, తప్పనిసరిగా వివాహితలై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 సంవత్సరాల మూలవయసు నిండిన వారు లేకపోతే.. 18 సంవత్సరాలు నిండిన వారిని పరిగణనలోకి తీసుకోనున్నట్లు చెప్పారు. దరఖాస్తుతో పాటు పుట్టిన తేదీ, వయసు, కుల, విద్యార్హత, నివాస ధ్రువీకరణ పత్రాలు.. అదనపు అర్హతలు, పూర్వా అనుభవ ధ్రువీకరణ పత్రం, అయితే భర్త మరణ ధ్రువీకరణ పత్రం, అనాథలైతే సర్టిఫికెట్ జత చేయాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళలో సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

స్త్రీనిధి రుణాలతో ఎంతో మేలు

జిల్లా స్త్రీనిధి ఏజీఎం రంతు చినబుల్లెయ్య



మాట్లాడుతున్న ఏజీయం చినబుల్లెయ్య

శావల్యాపురం: స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు జీవనోపాదులు పెంపుదలకు స్త్రీనిధి రుణాలు ఎంతో దోహదపడతాయని జిల్లా స్త్రీనిధి ఏజీయం రంతు చినబుల్లెయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీనిధి రుణాలు పురోగతి లక్ష్యాలపై గ్రామసమాఖ్య సభ్యులు వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీయం మాట్లాడుతూ జిల్లాలో స్త్రీనిధి రుణాలు 28 వేల 400 మహిళా సభ్యులకు రూ. 142 కోట్లు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకోగా ఇప్పటి వరకు 12 వేల 540 మంది స్వయ సహాయక మహిళా సభ్యులకు రూ.74 కోట్లు రుణాలను పారదర్శకంగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. ముఖ్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాలనలో మహిళలు అభ్యున్నతికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. మహిళ సభ్యుల జీవన ప్రమాణాలు పెంపుదలకు ప్రభుత్వం ఆర్థిక ప్రగతి పెరగడానికి క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టిందన్నారు. స్త్రీనిధి రుణ పరిమితి గతంలో కంటే ప్రస్తుతం రూ. 5 లక్షల వరకు పెంపుదల చేశామన్నారు. గ్రామ సంఘాలు నిరంతరం గ్రూపుల్లోని సభ్యులను పర్యవేక్షణ చేయటంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హత కల్గిన ఉన్న ప్రతి సభ్యురాలకు పథకాలు వర్తించేలా క్షేత్రస్థాయిలో వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులు సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. శావల్యాపురం మండలంలో 800 మంది మహిళా సభ్యులకు రూ. 5 కోట్లు స్త్రీనిధి రుణాలను అందజేశామన్నారు. లక్ష్యాలను అధిగమించడానికి కృషి చేసిన వారందరినీ ప్రత్యేకంగా ఏజీయం అభినందనలు తెలిపారు. స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడంతో పాటు చెల్లింపులు కూడా అవకతవకలకు తావులేకుండా ఉండేలా పేటీయం మిషన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. స్త్రీనిధి రుణాలు వచ్చే రెండు నెలల్లో నూరుశాతం అయ్యేలా ప్రతి ఒక్కరు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ సదస్సులో ఏపీయం జి.వాసుబాబు, సీసీలు గొట్టం రమాదేవి, ఖాజావలీ, బేబిరాణి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం జగన్ కృషి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొమెరపూడి వాసులు

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో పయనిస్తూ బడుగు, బలహీన వర్గాలకు సామాజిక, రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళ విజయ భాస్కర రెడ్డి అన్నారు. విజయవాడ స్వరాజ్ మైదానంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయం మహా శిల్పం సందర్శనకు కొమెరపూడి వాసులను ప్రత్యేక వాహనాల్లో ఆయన ఆదివారం తీసుకువెళ్లారు. ఆత్మస్థైర్యంతో బడుగు, బలహీన వర్గాలు ముందడుగు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన పరంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ స్ఫూర్తితో మరింత ముందుకు సాగేలా విజయవాడ నడిబొడ్డున నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణతో సీఎం ను ప్రజలు అభినందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కొమెరపూడి వాసులు ఉన్నారు.

చురుగ్గా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

నాదెండ్ల: పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పనులు సచివాలయాల్లో చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 2370 మందికి ఇళ్ల పట్టాలు అందాయి. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోనే నాలుగు సచివాలయాల పరిధిలో 1224 మందికి ఇంటి పట్టాలు దక్కా యి. సోమవారం సాయంత్రం నాటికి మండల పరిధిలో 40 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్లు రెవిన్యూ సిబ్బంది తెలిపారు. గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధి లో ఉన్న లబ్ధిదారులు మూడో సచివాలయంలో ఈనెల 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ పనులు ప్రారంభించారు. ఆదివారం సైతం రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. వీఆర్వోలు రిజి స్ట్రేషన్ పనులు నిర్వహిస్తున్నారు. గత నెల 27న ప్రారంభమైనప్పటికీ లాగిన్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నెల 18 వర కూ అన్ని సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు కావాలని ప్రభుత్వ అధికారులు ఆదేశించటంతో సచివాలయాల వద్ద లబ్ధిదారులు చేరుకుంటున్నారు. కొన్నిచోట్ల సర్వర్ మందకొడిగా ఉండి ప్రక్రియ నిదానంగా సాగుతోంది. ఉదయం ప్రారంభమై రాత్రి 10 గంటల వరకూ కూడా సచివాలయ సిబ్బంది శ్రమిస్తున్నారు.

అమరావతి తహసీల్దారు బాధ్యతల స్వీకరణ



అమరావతి: మండల తహసీల్దార్‌గా ఎ.వెంకటరమణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన విజయశ్రీ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. నెల్లూరు జిల్లా జలదంకి మండల తహసీల్దారు పనిచేసిన వెంకటరమణారావు పనిచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

క్రోసూరు ఎస్ఐగా షేక్ షఫీ

క్రోసూరు: మండల ఎస్ఐగా షేక్ షఫీ బదిలీ అయినట్లు పోలీస్ స్టేషన్ సిబ్బంది దాసు సోమవారం తెలిపారు. షఫీ గుంటూరు సీసీఎస్ నుంచి ఇక్కడకు వస్తున్నట్లు చెప్పారు. త్వరలో విధుల్లో చేరతారని పేర్కొన్నారు.

అక్రమ మద్యం కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార సోమవారం తెలిపారు. రొంపిచర్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా 15 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న బి. ఆదినారాయణను అరెస్ట్ చేశామన్నారు. అదే విధంగా నరసరావుపేట పట్టణంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న పూదోట జయన్నను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

పేద మహిళలకు దుస్తులు పంపిణీ

శావల్యాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిరుపేదలైన మహిళలకు నూతన వస్త్రాలు వితరణ చేసినట్లు డిప్యూటీ పారా మెడికల్ అధికారి చట్టు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 మంది అనాథలైన మహిళలకు ఒక్కొక్కరికీ రూ.2 వేలు విలువ చేసే దుస్తులు అందజేశారన్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం నేత పోట్లూరి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో సెంట్రల్ లైటింగ్ ఆరంభం



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలోని చెరువుగట్టు సెంటర్లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా చెరువుగట్టు సెంటర్‌లో ఏర్పాటు చేయదలిచిన వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని కూడా త్వరలో మాజీ మంత్రి నరసరావుపేట పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న పెద్దారెడ్డి కుటుంబాన్ని ఆయన అభినందించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక రూపొందించాలి

ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్నీ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల పనితీరు, శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందజేయాలన్నారు. గ్రామాలలో ఇంకా అర్హత ఉండి, పథకాలు పొందలేకపోతున్న వారిని గుర్తించి పథకాలు అందించాలన్నారు. మండల వ్యాప్తంగా పది సచివాలయాలు ఉంటే తొమ్మిది గ్రామాల్లో గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభించుకున్నామన్నారు. అదే విధంగా గ్రామాలలో సమస్యలను గుర్తించి త్వరతగతిన పరిష్కారమయ్యేలా చూడాలని ఎంపీపీ సూచించారు. మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను వెంటనే రిపేరు చేసి, నీటీ సమస్య లేకుండా చూడాలని సూచించారు. అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరెడ్డి, డెప్యూటీ తహసీల్దారు నిర్మల, వైస్ ఎంపీపీ షేక్ షహనాజ్ బేగం అహ్మద్ పాషా, బూదాటి మరియమ్మ, మరియదాసు, ఎంపీటీసీలు రేగులగడ్డ తిరుపతమ్మ, చిట్టిశెట్టి శివనాగమణి, బద్దూరి రమాదేవి, మర్రి శ్రీనివాసరెడ్డి, మాదాసు రాంబాబు, సర్పంచ్‌లు మార్నెళ్ల సరోజిని సాంబశివారెడ్డి, రమణారెడ్డి, సైదయ్య, బ్రహ్మం, తురకా కల్యాణ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంపీపీ

బెల్లంకొండ: ప్రకృతి వ్యవసాయ సాగులో పండిన కూరగాయలు, ఆకు కూరల విక్రయ కేంద్రాన్ని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వద్ద ఏర్పాటు చేశారు. నాగిరెడ్డిపాలెం, నందిరాజుపాలెం గ్రామాలకు చెందిన పలువురు మహిళలు పండించిన ఉత్పత్తులను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా విక్రయ కేంద్రాన్ని ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించి, కూరగాయలను కొనుగోలు చేశారు. రసాయనాలు లేకుండా పండించిన పంటలు ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచి దన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేస్తుందని, రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించి, పంటలను పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనంతలక్ష్మి, అంజలి, జయలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అనుముల రాంబాబు, రామయ్య

సత్తెనపల్లి: బాపట్లలోని టీటీడీ కల్యాణ మండపంలో గత ఆదివారం జరిగిన కరాటే ఇంటరేట్ చాంపియన్ షిప్ టోర్నమెంటులో సత్తెనపల్లికి చెందిన షీకాకాయ్ షిటోరియో కరాటే స్కూలు విద్యార్థులు 22 మంది ప్రతిభ చూపారు. బ్లాక్ బెల్ట్ విభాగంలో జీటీ జశ్విత, ఎం.రామబ్రహ్మాచారి చాంపియన్స్‌గా నిలిచారని స్కూల్ ప్రతినిదులు తెలిపారు. వ్యక్తిగత బాలికల కటా విభాగంలో జీటీ జశ్విత(14), టి. నిఖిత(13), అక్షయ(8), ఎస్.ఎస్.ఎస్ అక్షర(10), బ్రాంజ్‌లో ఎస్. శరణ్య(13), వ్యక్తిగత బాలుర కటా విభాగంలో డీఎంఎస్ రామబ్రహ్మాచారి(15), గోల్డ్‌లో బి. బాలాజీ(11), ఎల్. గేష్మ(10), టి. అఖిల్(12), బి.లోకేష్(12), సిల్వర్‌లో.. టి. నాగ నితీష్నాయుడు(8), సీహెచ్.జస్వంత్(12), పీఎస్ఎన్ చరణ్(14), బ్రాంజ్‌లో పీఎన్వీ సుఖేత్(15), బి.టిషాంత్(9), ఎ.ధనుంజయ్(9), పీఎస్ కార్తికేయ(10), బి.సత్యన్నారాయణ(11), కె.తేజా ప్రకాష్(10), ఎల్.కిరీట్, వి.దివీస్(11), వి. అభినవ్(13) ప్రతిభ చూపారని తెలిపారు. విద్యార్థులను షిహాన్ అనుముల రాంబాబు, అనుముల రామయ్య సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎంఈఓ నరసింహారావు

అచ్చంపేట: ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమత నిరుపేద విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ అందిస్తున్న సహకారం, సేవలు అభినందనీయమని ఎంఈవో రావిపాటి నరసింహారావు అన్నారు. మాదిపాడు పంచాయతీ పరిధిలోని జడపల్లి తండాకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి బాణావత్ అంజన్ కుమార్ నాయక్‌కు ప్రాజెక్టు వర్క్ నిమిత్తం రూ.40వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను స్నేహహస్తాలు ఫౌండేషన్ దాతృత్వంతో సోమవారం ఆయన అందచేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా ఎందరో నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుకు లాప్‌టాప్‌లు ఇస్తూ.. ఫీజులు చెల్లిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలకు ఫర్నిచర్‌ను సరఫరా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి చైర్మన్ తుమ్మా శౌరెడ్డి, ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం రావాలని జిల్లా బీజేపీ పబ్లిసిటీ కన్వీనర్ నోముల మణికంఠ కోరారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో 'సకల జనుల సౌభాగ్య ఆంధ్రప్రదేశ్' వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు కొక్కెర శ్రీనివాసరావు యాదవ్, సత్తెనపల్లి నియోజకవర్గ కన్వీనర్ కేతబోయిన హనుమంతరావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లపై అసత్య ప్రచారాలు తగదు

బెల్లంకొండ: పులిచింతల ప్రాజెక్టు పునరావాస కేంద్రాల్లో నిర్వాసితుల ఇళ్ల పట్టాల ఉచిత రిజిస్ట్రేషన్లపై తప్పుడు ప్రచారాలు తగదని మండలంలోని న్యూచిట్యాల పునరావాస కేంద్రం సర్పంచ్ బాణావతు నరసింహా నాయక్ అన్నారు. రిజిస్ట్రేషన్లకు మామూళ్లు వసూలు చేస్తున్నారంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. ఇళ్ల పట్టాల ఉచిత రిజిస్ట్రేషన్‌కు అధికార పార్టీ నాయకులు, రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది డబ్బులు తీసుకుంటున్నారంటూ ఎల్లో మీడియా తప్పుడు వార్తలు రాయడం దారుణమన్నారు. రిజిస్ట్రేషన్లు కాకుండా ఉండేందుకు టీడీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ అయితే బ్యాంకులో రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం తమకు మంచి చేస్తుంటే చూడలేక ఇలాంటి చర్యలకు దిగడం సిగ్గుచేటన్నారు.

గోల్డ్ అప్రయిజర్ కావలెను
ఏదైన బ్యాంకులలో గోల్డ్ అప్రయిజర్‌గా పనిచేసి, నమ్మకము, నిజాయితీ, నిబద్ధత గల అభ్యర్థులు, అప్రయిజర్ సర్టిఫికెట్‌తో అనుభవం గల వారు సంప్రదించండి.
ది ఆంధ్రాబ్యాంక్ రైతు సేవాసహకార సంఘం
ధూళిపాళ్ళ గ్రామము, సత్తెనపల్లి (మం)

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com